# మానవ హక్కుల వేదిక

# HUMAN RIGHTS FORUM (HRF)

## ANDHRA PRADESH & TELANGANA

---

**తేదీ** 24 జనవరి 2019

## <u>పత్రికా ప్రకటన</u>

## ఆర్థిక ప్రాతిపదిక మీద 10 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

'ఆర్థికంగా బలహీనమైన సెక్షన్ల' వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన 103వ రాజ్యాంగ సవరణ చట్టం -2019ని మానవ హక్కుల వేదిక (HRF) నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తోంది. రిజర్వేషన్ల విధానానికి ప్రాతిపదికగా నిలిచిన మౌలిక రాజ్యాంగ స్వభావానికి, స్ఫూర్తికి విరుద్ధంగా ఈ సవరణ తీసుకువచ్చారు. ఫలితంగా అనాదిగా కుల వివక్షకూ, వెలివేతకూ, సాంఘిక దురన్యాయాలకూ గురవుతూ వస్తున్న కులాల ప్రజల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. సమానత్వం, సామాజిక న్యాయం అనే రాజ్యాంగ ఆదర్శాలను పక్కకుతోసి సమాజంలో కులాధిపత్యాన్ని, కుల దురహంకారాన్ని ఈ సవరణ చట్టం మరింత స్థిరీకరించబోతోంది.

కులాన్ని బట్టే మనుషుల యోగ్యతను నిర్ధారించే దేశం మనది. అలాంటి దేశంలో ఆయా అణగారిన వర్గాల వెనుకబాటుతనానికి కారణం కులమేనన్న వాస్తవాన్ని తోసిపుచ్చి, పేదరికమే దానికి కారణమనే భావనను బీజేపీ ప్రభుత్వం ఈ సవరణ ద్వారా నేడు మరొక్కసారి తెరమీదకు తెచ్చింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కులాల వారిపై కులం పేరుమీద అమలయిన, అవుతున్న వివక్ష, అణచివేత విధానాలను నిలువరించడానికి వచ్చినవే రిజర్వేషన్లు. రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన కోసం కాదని చెబుతూ అంబేద్కర్ అవెందుకో విస్పష్టంగా చెబుతారు. తరతరాలుగా వ్యవస్థలో వేళ్ళూనుకుని పోయి సంప్రదాయం, శాసనం ఆమోదించిన కుల వివక్షను ఎదురొడ్డటం కోసమే రిజర్వేషన్లు అని ఆయన పేర్కొంటారు. ఇప్పుడు దాన్ని సామాజికంగా ఏ వివక్షకూ గురవని ఉన్నత కులాలకు, వర్గాలకు వర్తింపజేయడంతో మొత్తంగా రిజర్వేషన్ విధానమే ఒక ప్రహసనంగా మారిపోయే స్థితి దాపురించింది. సామాజిక న్యాయం అన్న ఆదర్శాన్ని నిష్ఫలం చేసే ఒక అంతిమ ప్రయోజనాన్ని కాంక్షించి మాత్రమే బీజేపీ ఈ పనికి దిగిందనడంలో సందేహం లేదు.

సామాజికంగా, విద్యాపరంగా అణగారిన వర్గాల ప్రజలకు కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించే పద్ధతిని సామాజిక, ఆర్థిక రంగాల్లో ఆధిపత్యం గడించిన శక్తులు ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే వచ్చాయి. రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నాలు ముందుకు సాగకుండా అడుగడుగునా మోకాలడ్డుతూ వచ్చాయి. కులవ్యవస్థ ఆధిపత్య కులాలకు కల్పించిన గుత్తాధికారాన్ని సామాజిక రిజర్వేషన్లు కొంత మేరకైనా సడలించగలగడమే వారి ఈ వ్యతిరేకతకు కారణం. 'ఆర్థిక ప్రాతిపదికపైనే' రిజర్వేషన్లు కల్పించాలనడం ఈ దేశంలో అన్నిరంగాలలోనూ ఊడలు దిగిన కులాన్ని చూడ నిరాకరించడమే అవుతుంది. అది సృష్టించిన ఆగడాలనూ, ఘోరకలినీ, చాపకింద నీరులా చేరి రాజేస్తున్న విద్వేషాన్నీ విస్మరించడమే అవుతుంది. కులం పేరు మీద అమలవుతున్న వివక్ష, అణచివేత, వెలివేత విధానాలపై తలపడటానికి ఆధిపత్య కులాల వారు సుముఖంగా లేరన్న విషయాన్ని ఈ డిమాండు వెల్లడిస్తోంది. కులం పేరుతో వారు పొందే ప్రయోజనాలకు ఎవరూ అడ్డుపడకూడదనే దుగ్ధ, ఆ ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం వారు పడే తపన, చేసే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. అనాదిగా మనుషులకు సామాజిక వైకల్యాన్ని అంటగట్టిన కులాన్ని పక్కన పెట్టి దాని స్థానంలో ఆర్థిక ప్రమాణాలను రిజర్వేషన్లకు ప్రాతిపదికగా చేయడం చారిత్రిక తప్పిదం అవుతుంది. ఎస్సీ ఎస్టీలు కాని వారికీ, ఓబీసీ యేతరులకూ అవకాశాలు దక్కక పోవడానికి కారణం రిజర్వేషన్లూ కాదు లేదా వారేదో కుల వివక్ష లాంటి సామాజిక దురన్యాయానికి గురికావడం వల్లనూ కాదు. పిడికెడు మంది ఆర్థిక ప్రయోజనాలను కాపాడే విధానాలను ప్రభుత్వాలు అనుసరించడం వల్ల మాత్రమే ఆ పరిస్థితి దాపురించింది.

ఆర్. ఎస్. ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్, సంయుక్త ప్రధాన కార్యదర్శి ఎం.ఎం. వైద్య రిజర్వేషన్ల విధానాన్ని సమీక్షించాలని 2014 లో ప్రకటించడాన్నీ, తీవ్రమైన ప్రతిఘటన ఎదురయ్యే సరికి వాటిని అనిష్టంగానైనా ఉపసంహరించుకున్న వైనాన్నీ ఈ సందర్భంగా గుర్తుచేసుకోవడం ఉచితంగా ఉంటుంది. భారత్ రాజ్యాంగ మౌలిక విలువల పట్ల ఆర్.ఎస్.ఎస్.- బీజేపీ ద్వయానికి బొత్తిగా గౌరవం లేదు. రిజర్వేషన్ల పట్ల వారి విముఖత అందరికీ తెలిసినదే. వివక్షకు గురయిన, గురవుతున్న వారికి విద్య, ఆర్థిక, రాజకీయ రంగాలలో తగు ప్రాతినిధ్యం కల్పించి సామాజిక హుందాతనాన్నీ, గౌరవాన్నీ పెంపొందించే సానుకూల చర్యలనూ, భారత రాజ్యాంగంలోని పొందుపరచిన సమానత్వ భావాన్నీ ఎంతమాత్రం అంగీకరించలేని ప్రాపంచిక దృష్టి వారిది. అణగారిన కులాల వారిని పచ్చి పుండులా సలిపే కులవివక్షను నిర్మూలించే ఉద్దేశంతోనే మన దేశంలో రిజర్వేషన్ల విధానం రూపొందింది. నేడు దాని స్థానంలో 'ఆర్థిక ప్రాతిపదిక'ను తీసుకురావడంలో ఔచిత్యం లేదని మానవహక్కుల వేదిక భావిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించడం పేరుతో జరుగుతున్న ఈ ప్రయత్నం వెనుక 'అందరికీ సమాన అవకాశాలు' అనే అమూల్యమైన భారత రాజ్యాంగ మౌలిక సూత్రాన్ని హరించే కుట్ర దాగి ఉంది.

ఈ సవరణ భారత రాజ్యాంగాన్ని వమ్ముచేసే ప్రయత్నమేనని మానవహక్కుల వేదిక భావిస్తోంది. ఇది రాజ్యాంగంలోని 14వ అధికరణంలోని అసమానులను సమానులుగా చూడాలని చెప్పే 'సమాన రక్షణ' సూత్రాన్ని (Equal Protection Clause) నీరుగార్చే, నిరుపయోగకరంగా మార్చే ప్రయత్నంగా భావిస్తోంది. ఈ సవరణ రాజ్యాంగంలో వివిధ అధికరణలలో పొందుపరచిన సమానత్వ హక్కుల యావత్తు సారాన్నీ, క్రమాన్నీ భంగపరచింది. రాజ్యాంగ మౌలిక స్వరూపానికే తూట్లు పొడిచింది. ఈ దేశంలో సమానత్వ హక్కుకు ముప్పు ప్రధానంగా కుల వ్యవస్థలో పొంచి ఉందని మన రాజ్యాంగ కర్తలు గుర్తించి రాజ్యాంగంలోని 15 నుండి 17 అధికరణాలను అందుకు అనుగుణంగా తీర్చిదిద్దారు. బాలాజీ కేసు (1963) నుండి అశోక్ కుమార్ ఠాకూర్ కేసు (2008) వరకూ మన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కులాన్ని ఒక సామాజిక వాస్తవంగా గుర్తించి దానిని వెనుకబాటుతనానికి ఒక ప్రధాన ప్రాతిపదికగా గుర్తిస్తూ వచ్చారు. 'ఆర్థికంగా బలహీనమైన సెక్షన్ల' వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కొత్తగా చేర్చిన 15(6), 16(6) క్లాజులు నిజానికి అన్ని రకాల సామాజిక వివక్షలనూ నిషేధించే 15, 16 అధికరణాల క్రమంలో చేర్చడానికి ఎంతమాత్రం తగనివి. సమాజంలో స్థిరపడిపోయిన సామాజిక పక్షపాత వైఖరులను కూకటివేళ్ళతో పెకిలించే ఉద్దేశంతో ఈ 15,16 అధికరణాలను రూపొందించారు. కుల వివక్షతకు గురవుతున్న వారికి విద్య, ఆర్థిక, రాజకీయ రంగాలలో తగు ప్రాతినిధ్యం కల్పించే సానుకూల చర్యలు మాత్రమే వారికి హుందాతనాన్నీ, గౌరవాన్నీ తిరిగి కల్పిస్తాయి. 'ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు' అనే పదం స్థానంలో 'ఆర్థికంగా బలహీనమైన సెక్షన్లు' అనే పదాన్ని సవరణలో ప్రయోగించడం వెనుక పెద్ద కుట్రే దాగివుంది. ఈ పదప్రయోగాన్ని చాలా ముందుచూపుతో చేశారని అర్థమవుతోంది. కులం, వర్గం అనే విషయాల చుట్టూ న్యాయస్థానాలలో ప్రతిధ్వనించిన చర్చల సారాన్ని మన సమిష్టి జ్ఞాపకాలలోంచి తుడిచిపెట్టే దురాలోచన దీని వెనుక వుంది.

ఈ సవరణ ప్రవేశపెట్టే ముందు విస్తృత అధ్యయనం చేపట్టవలసిన అవసరాన్ని కూడా ప్రభుత్వం గుర్తించలేదు. మానవ జాతికి తీవ్రమైన హానిచేసే నేరపూరిత పాత్ర పేదరికానిదన్నది ఎవరూ కాదనలేని కఠోర వాస్తవం. అయితే 'ఆర్థికంగా బలహీనమైన సెక్షన్లు' ఎవరో తేల్చి చెప్పే సహేతుక వర్గీకరణేదీ ఈ సవరణలో కనిపించదు. దాల్మియా (1958), మనేకా గాంధీ (1978) కేసుల్లో సుప్రీంకోర్టు ప్రతిపాదించిన 'సహేతుక వర్గీకరణ' (The test of 'reasonable classification') లేదా 'నిర్హేతుక అధికార వినియోగం' (The test of 'arbitrariness') పరీక్షల ముందు ఈ వర్గీకరణ నిలవజాలదు.

ఈ సవరణ ద్వారా ఆందోళనకరమైన మరో అంశం రాజ్యాంగంలోకి వచ్చి చేరింది. 'ఆర్థికంగా బలహీనమైన సెక్షన్లకు' 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని 15(6), 16 (6) అధికరణాలలోనే పేర్కొని వాటికి రాజ్యాంగ హోదా ఇచ్చేసారు. ఎస్.సి.,ఎస్.టి., ఓ.బి.సి.లకు ఎంత శాతం రిజర్వేషన్ కల్పించాలో రాజ్యాంగంలో ఎక్కడా లేదు. కొత్తగా ఇపుడు చేర్చలేదు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని ఎప్పటిలా కోర్టులు

పట్టుబడితే ఎస్.సి.,ఎస్.టి., ఓ.బి.సి.లకు ఇచ్చే రిజర్వేషన్ కంటే 'ఆర్థికంగా బలహీనమైన సెక్షన్లకు' 10 శాతం పైనే రిజర్వేషన్ అమలయ్యే అయ్యే అవకాశముంది.

సవరణ చట్టం ఎందుకు అవసరం అయ్యిందో తెలిపే చారిత్రిక సందర్భాన్ని కానీ, అది పరిష్కరించాలని భావిస్తున్న వివక్ష స్వరూప స్వభావాల గురించి గానీ, అసలు అది వివక్షగా భావిస్తున్న అంశాలు 15, 16 అధికరణాల పరిధిలోకి వస్తాయా రావా అన్న విషయాన్ని గురించి గానీ వివరించడంలో ఆ చట్టం కోసం రాసిన 'లక్ష్యాల, కారణాల ప్రకటన' ఘోరంగా విఫలం అయ్యింది. చారిత్రిక నేపధ్యాన్ని వివరించాల్సి వస్తే రాజ్యాంగంలోని 39 అధికరణంలోని ఆదేశిక సూత్రాలను అమల్లోకి తేవడంలో ప్రభుత్వం ఎంత ఘోరంగా విఫలమైందో ప్రభుత్వం తనకు తానే ఒప్పుకోవాల్సి వస్తుంది. ఆ పని చేయడం ఇష్టం లేకనే వాటి గురించి నిశ్శబ్దాన్ని పాటించింది. పేద ధనిక వర్గాల మధ్య అఖాతాన్ని పూడ్చడానికి 72 సంవత్సరాలు ఈ ప్రభుత్వాలకు సరిపోలేదు. భౌతిక వనరులను సమానంగా పంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉండింది. కానీ ప్రభుత్వాలు ఆపని చేయలేదు. పైపెచ్చు ఆర్థిక వనరులు, సంపద పిడికెడు మంది వద్దే జుగుప్సాకరంగా పోగుబడిపోవడానికి కారణమయ్యాయి. ప్రభుత్వాలు భూసంస్కరణలు జరగకుండా చూసి, ప్రణాళికలను అటకెక్కించి ప్రజలను స్వేచ్ఛా విపణికి బలిపశువులను చేసాయి. నూతన ఆర్థిక విధానాలు ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడి ప్రజలను నిలువెల్లా దోచుకుంటోంది. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే స్థితిలో ఉంది. నిరుద్యోగం యువతను దహిస్తోంది. ఈ సమస్యలన్నిటికీ సరైన పరిష్కారం వెతికే బదులు బీజేపీ ప్రభుత్వం నేడీ సవరణను ప్రజలపై రుద్ది రాజ్యాంగాన్ని వంచించడానికి పూనుకుంది.

'ఆర్థికంగా బలహీనమైన సెక్షన్లు ' ఎవరో తేల్చడానికి బీజేపీ మంత్రులూ, నేతలూ ఒక అన్యాయమైన కధనాన్ని అల్లారు. రూ. 8 లక్షల వార్షికాదాయం లేదా ఐదు ఎకరాల వ్యవసాయ భూమి; లేదా నోటిఫైడ్ మునిసిపాలిటీలో వెయ్యి చదరపు గజాల స్థలం; లేదా నాన్-నోటిఫైడ్ మునిసిపాలిటీలో రెండు వేల చదరపు గజాల భూమి ఉన్న వారూ 'ఆర్థికంగా బలహీనమైన సెక్షన్లు' అట! పేద వారి పట్ల, వారు పడే అగచాట్ల పట్ల వారికి ఎంత సానుభూతి ఉన్నదో దీన్ని బట్టి అర్థమౌతుంది.

రిజర్వేషన్లు సహా అటువంటి సానుకూల చర్యల లక్ష్యం పేదరిక నిర్మూలన కానేకాదు. వాటి లక్ష్యం సామాజిక సమానత్వం సాధించడం. ఆర్థికంగా వెనుకబడిన వారి స్థితిగతులు మెరుగు పరచాలని ప్రభుత్వం నిజంగా భావిస్తే పాలకులు భూ సంస్కరణలు అమలు చేయాలి, ఉద్యోగావకాశాలు పెంచాలి, సామాజిక భద్రత కల్పించాలి, ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలి, వారు నిర్లక్ష్యం చేసిన రాజ్యాంగ ఆదేశిక సూత్రాలను నిక్కచ్చిగా అమలు చేయలి. అసలు ప్రభుత్వమే నికార్సైన సంక్షేమ రాజ్యంగా అవతరించాలి.

'ప్రతిభని చంపేస్తున్నారు' అని గగ్గోలు పెట్టే ఆధిపత్య కులాల వారు ఈ సవరణపై నోరు మెదపలేదు. కనీసం నిరసన కూడా వ్యక్తం చేయలేదు. 'కోటా' మాట ఎత్తగానే ఆందోళనలకు దిగే వారు నేడు భయంకర

నిశ్శబ్దాన్ని ఆశ్రయించారు.వారి ఆరాటం కేవలం కుల ప్రాతిపదికన ఉండిన రిజర్వేషన్లను వ్యతిరేకించడమే తప్ప మరొకటి కాదు. తమకు అనుకూలంగా కోటా వస్తే వారికి అభ్యంతరం లేదు. కొత్త కోటా వారెవరి ప్రతిభనూ హరించేది కాదేమో!

ఈ సవరణ తీసుకుని వచ్చిన తీరు కూడా ఆందోళనకరంగా ఉంది. భాగస్వామ్య ప్రజాస్వామ్యంలో శాసన బిల్లులపై ప్రజాభిప్రాయ సేకరణ చేయడం ఒక కనీస అవసరం. పాలనాపరంగా ఆచరణయోగ్యమైన పద్ధతి. అందులోనూ నేడు ప్రభుత్వం తీసుకువచ్చింది ఆషామాషీ చట్టం కాదు. ఒక రాజ్యాంగ సవరణకే పూనుకున్నారు. ప్రజలనుంచి గోప్యంగా ఉంచి ఆగమేఘాల మీద ఈ విధంగా సవరణ తీసుకురావడం శాసన ప్రక్రియనూ, రాజ్యాంగాన్ని కించపరచడమేనని మానవహక్కుల వేదిక భావిస్తోంది.

రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధికార పార్టీ ఈ సవరణను ప్రతిపాదించింది. ప్రతిపక్ష పార్టీలు ఆమోదముద్ర వేసేసాయి.ఎన్నికల నేపథ్యంలోనే అధికార పార్టీతో భావజాలపరంగా విభేదించే పార్టీలు సైతం సవరణను ఒప్పేసుకున్నాయి. ఆమాట నిజమే గానీ ఇది కేవలం ఒక ఎన్నికల ఎత్తుగడ అనుకుంటే పొరబాటే అవుతుంది. కుల వివక్ష సహా వివిధ రకాల వివక్షతలను ప్రశ్నించి, ప్రాతినిధ్య సూత్రాన్ని గౌరవించే గుణం భారత రాజ్యాంగానికి ఉంది కనుకనే ఆర్.ఎస్.ఎస్, బీజేపీలు దానితో విభేదిస్తాయి. అందుకే వారు 'ఆర్థిక ప్రాతిపదిక' వాదాన్ని ముందుకు నెడుతూనే ఉంటారు. ఈ సవరణ ఇందుకు తాజా ఉదాహరణ. రాజ్యాంగంపై జరిగిన ఈ దాడిని ప్రజాస్వామిక శక్తులు అందరూ వ్యతిరేకించాలని మానవహక్కుల వేదిక కోరుతోంది .

| | |
|---|---|
| ఎస్. జీవన్ కుమార్ | వేమన వసంత లక్ష్మి |
| వి.ఎస్.కృష్ణ | ఎ. చంద్రశేఖర్ |

ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ సమన్వయ కమిటీ సభ్యులు

**మానవ హక్కుల వేదిక (HRF)**